



రిమ్స్‌లో.. మెడికల్ మాఫియా



- రిమ్స్‌లో మందుగోలీల పేరిట దోపిడీ దందా
- దగ్గు, జ్వరంతో పాటు జలుబు మందులకు బయటకే..
- ప్రిస్క్రిప్షన్ చీటీలు రాస్తూ.. ప్రైవేట్‌కు రెఫర్
- మెడికల్ షాపుల ద్వారా కమీషన్ పంపకాలు
- రోగుల నడి విరుస్తున్న సర్కారీ వైద్యం
- ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది రోగుల రాక

ఆదిలాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది. నిబంధనలకు విరుద్ధంగా రిమ్స్ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో మెడికల్ షాపులను ఏర్పాటు చేస్తూ అడ్డగోలు దందాకు ఎగబడుతున్నారు. జిల్లా సూపర్ స్పెషాలిటీ, రిమ్స్ ఆసుపత్రికి నిత్యం జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి వందలాది మంది రోగులు వైద్యం కోసం వస్తుంటారు. కానీ అవసరమైన మందుగోలీలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వైపు పరుగులు తీస్తున్నారు. కనీసం దగ్గు, జ్వరం, జలుబు, చిన్నపాటి వ్యాధులకు సంబంధించిన మందులు సైతం అందుబాటులో లేకపోవడంతో రోగులు వారి బంధువులు ప్రైవేట్ మెడికల్‌ల నుంచి కొనుగోలు చేస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉచిత వైద్యాన్ని అందిస్తున్నా.. రోగులను మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో అత్యవసర వైద్యం పేరిట కొంత మంది వైద్యులు ప్రైవేట్ మెడికల్ షాపులకు రెఫర్ చేయడం విమర్శలకు దారి తీస్తోంది. రిమ్స్ ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో నాలుగైదు ప్రైవేట్ మెడికల్ షాపులు పూర్తిగా రిమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగుల పైనే ఆధారపడి నడపడం చర్చనీయాంశంగా మారింది. ఇదంతా అధికారులకు తెలిసినా.. తెలియనట్లుగానే వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఉచిత వైద్యం కోసం సర్కారీ దవాఖానాకు వస్తే.. సరిపడా మందులు లేవంటూ జేబులు ఖాళీ చేస్తున్నారంటూ రోగులు వాపోతున్నారు. ఉచిత వైద్యం మాట దేవుడెరుగు.. కానీ మందుల పేరిట మెడికల్ మాఫియా అడ్డగోలుగా దండుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

: రాథోడ్ జైసింగ్, రిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్, ఆదిలాబాద్



రిమ్స్ ఆసుపత్రి నుంచి ప్రైవేట్ మెడికల్‌కు ప్రిస్క్రిప్షన్ చీటీలను పంపుతున్నట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. ఎప్పటికప్పుడు పరిశీలించి మందులను అందుబాటులో ఉంచుతున్నాం. ఎవరైనా వైద్యులు ఆసుపత్రిలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.





- వైద్యుడు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ మందుల చీటీని చూపుతున్న రోగి బంధువు లక్ష్మి

పైఫొటోలో కనిపిస్తున్న ఆదివాసీ మహిళ.. భీంపూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి. ఈమె భర్త అశోక్ గత రెండు రోజుల క్రితం ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ప్రమాదానికి గురికావడంతో తలకు గాయమైంది. దీంతో వైద్యం కోసం రిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చింది. రెండు రోజులుగా వైద్యాన్ని అందిస్తున్నా.. అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో సంబంధిత వైద్యుడు ఆయింట్‌మెంట్ కోసం రిమ్స్ ఆవరణలో ఉన్న మెడికల్ షాపునకు ప్రిస్క్రిప్షన్ చీటీని ఇచ్చి పంపించారు. దీంతో రూ.30 పెట్టి ఆయింట్‌మెంట్ ట్యూబ్‌ను కొనుగోలు చేసినట్లు పేర్కొంటుంది.





- వైద్యుడు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ మందుల చీటీని చూపుతున్న రోగి బంధువు సాయన్న

పై ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు.. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం చామన్‌పెల్లి గ్రామానికి చెందిన సాయన్న. ఇతని కుటుంబ సభ్యులు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. దీంతో అవసరమైన మందులు లేవని డాక్టర్ చెప్పడంతో ఆసుపత్రి ఆవరణలో ఉన్న మెడికల్ షాపునకు వచ్చి సంబంధిత వైద్యుడు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ చీటీతో రూ.400 విలువైన మందులను కొనుగోలు చేసి ఆసుపత్రికి తీసుకెళ్తున్నట్లు పేర్కొంటున్నాడు. ఇలాంటి పరిస్థితులే రిమ్స్ ఆసుపత్రిలో నిత్యం వందలాది మంది రోగులకు ఎదురవుతున్నాయని పలువురు రోగుల బంధువులు చెబుతున్నారు.

పక్క ఫొటోలో మందులను చూపుతూ.. కనిపిస్తున్న వ్యక్తి పేరు జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఇస్తాంత్ రాజు. ఆయన కుమారుడికి జలుబు, తీవ్రమైన జ్వరం రావడంతో రిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. కానీ అవసరమైన మందులు లేవంటూ వైద్యులు ప్రిస్క్రిప్షన్ చీటీని రాసివ్వడంతో ప్రైవేట్ మెడికల్‌లో మందులను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నాడు. రూ.40 విలువ చేసే సిరప్ రాసిచ్చినట్లు పేర్కొన్నారు.



- ప్రిస్క్రిప్షన్ చీటీతో మందులను కొనుగోలు చేసి తీసుకెళ్తున్న రాజు

మందుగోలీ కరువు

పేరుకే పెద్ద ఆసుపత్రి అయిన రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో మందు గోలీలు కరువయ్యాయన్న ఆరోపణలు వస్తున్నాయి. గత కొద్దిరోజులుగా

(తరువాయి 6వ పేజీలో...)



బోరజ్‌లో గల చెక్‌పోస్టు కార్యాలయం

చెక్‌పోస్టుపై అర్ధరాత్రి ఏసీబీ దాడులు

జైనథ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరజ్ చెక్‌పోస్టు కార్యాలయంలో మంగళవారం అర్ధరాత్రి మూడు గంటల ప్రాంతంలో కరీంనగర్ డివిజన్ ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. విస్తృతంగా తనిఖీలు నిర్వహించిన అధికారులు చెక్‌పోస్టు లెక్కల్లో లేని, రశీదులకు సంబంధం లేని రూ.62500 నగదును సీజ్ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఏసీబీ బృందాలు తనిఖీలు చేస్తున్న నేపథ్యంలో ఏసీబీ అధికారులు బోరజ్ ఉమ్మడి తనిఖీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోరజ్ చెక్‌పోస్టులో విధి నిర్వహణలో ఉన్న ఏఎంవీఐలు మోహన్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్‌లను విచారించినట్లు అధికారులు పేర్కొన్నారు.

రేపు జిల్లాకు విద్యా కమిషన్ చైర్మన్ రాక

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి రిటైర్డ్ ఐఏఎస్ సివిల్ సర్వెంట్ జిల్లాకు రానున్నారని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులు జిల్లా పర్యటన సందర్భంగా జిల్లాలోని విద్యా సంస్థల ను సందర్శించనున్నారన్నారు. అందుకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పీడీఎస్ బియ్యం బహిరంగ వేలం

ఇంద్రవెల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన పీడీఎస్ బియ్యాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వుల మేరకు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. అక్ర ఇటీవల అక్రమంగా తరలిస్తున్న వ్యక్తుల నుంచి ఏడు క్వింటాళ్ల 8 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వేలంలో చింతావర్ సంతోష్ అనే వ్యాపారి రూ.16,362లకు దక్కించుకున్నారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఆర్ఐ మెస్రం లక్ష్మణరావు, తదితరులు ఉన్నారు.

ఆదాయం పెంపునకు అదనపు చెక్‌పోస్టులు : ఆర్‌జేడీఎం

బోథ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 110 మార్కెట్ యార్డులలో మరింత ఆదాయం పెంపునకు తాత్కాలిక చెక్‌పోస్టులను ఏర్పాటు చేయిస్తున్నట్లు వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ మార్కెటింగ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో రైతులకు ఉన్న వసతులను పరిశీలించారు. గతంలో ప్రతిపాదించిన పనుల గురించి వాటి అవసరం ఉంది అనేది మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్, అధ్యక్షుడు బొడ్డు గంగారెడ్డితో చర్చించారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న 110 మార్కెట్ యార్డుల పరిధిలో ఆదాయ వనరుల పెంపు కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్కెట్ యార్డుల పరిధిలో చెక్‌పోస్టు ఏర్పాటు వల్ల ఆదాయం సమకూరుతుందన్నారు. బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో మహారాష్ట్రకు అక్రమంగా ధాన్యం తరలిపోకుండా మరలపల్లి రూట్‌లో చెక్‌పోస్టును తాత్కాలికంగా ఏర్పాటు చేయాలన్నారు.

● గిట్టుబాటు ధర లేకపోతే కొనుగోలు చేస్తాం

రైతులకు ప్రభుత్వరంగ సంస్థల ద్వారా పంటలను కొనుగోలు చేయిస్తామని ఆర్‌జేడీఎం వివరించారు. సూర్యాపేట, జనగాం, సేనముద్రం, ఖమ్మం, తిరుమలగిరి, తదితర మార్కెట్ యార్డులను గతంలో గిట్టుబాటు ధర కోసం పెసర్లను కొనుగోలు చేయించామన్నారు.

నాణ్యమైన విద్యా బోధన అందించాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా ● ఉమ్రి(బి)లోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

గుడిహత్నూర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలో చదువుతున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్యా బోధనతోపాటు రుచికరమైన భోజనం అందించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని ఉమ్రి(బి)లోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల రిజిష్టర్, వసతి గృహంలో ఉన్న వంట సరుకులు, కూరగాయలు, స్టోర్ రూమ్ పాఠశాల ఆవరణను, తరగతి గదులు పరిశీలించి పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. విద్యా బోధన, భోజన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. వారి సందేహాలను నివృత్తి చేసి ప్రతిభను గుర్తించాలన్నారు. అలాగే మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని అందించాలని వార్డెన్‌ను సూచించారు. సాయంత్రం సమయంలో స్టడీ అవర్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువులో వెనుకబడ్డ వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత వచ్చేలా చూడాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయిలోకి వెళ్లాలన్నారు. అనంతరం మండలంలోని మన్నూర్ సమీపంలో ఉన్న జన్నింగ్ మిల్లును కలెక్టర్ సందర్శించారు. జిన్నింగ్ మిల్లులో జరుగుతున్న పత్తి విక్రయాలను పరిశీలించారు. తహసీల్దార్ కవితారెడ్డి, ఆర్ఐ అరుణ్‌కుమార్, హెచ్ఎం, పాఠశాల సిబ్బంది, తదితరులు ఉన్నారు.



పాఠశాలలో కూరగాయాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

● తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలి

గుడిహత్నూర్(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే వివరాల డాటా నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. వివరాలు నమోదు సందర్భంగా ఎన్యూమరేటర్లు లేకపోవడంపై అధికారుల పై కలెక్టర్ మండిపడ్డారు. సర్వే వివరాలను కంప్యూటర్ ఆపరేటర్లు తప్పుగా నమోదు చేస్తే బాధ్యులు ఎవరని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. నమోదు సందర్భంగా అందుబాటులో లేని సంబంధిత పంచాయితీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో అబ్దుల్ హైను ఆదేశించారు. సర్వే నమోదు ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు ఎన్యూమరేటర్లు అందుబాటులో ఉండాలని హెచ్చరించారు.

తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహిస్తాం

● ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త

ఉట్నూర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజనులకు ప్రత్యామ్నాయ ఆదాయం కల్పించే విధంగా తేనెటీగల పెంపకం చేసే గిరిజన యువతీ, యువకులకు ఐటీడీఏ సహకరిస్తుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధి కారి ఖుష్బుగుప్తా అన్నారు. బుధవారం సెంటర్‌ఫర్ వరల్డ్ సాలిడారిటీ (సీడబ్ల్యుఎస్) సంస్థ ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకంపై ఉట్నూర్ కుము రంభీం కాంప్లెక్స్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాణ్యమైన తేనేకు బహిరంగ మార్కెట్‌లో చాలా డిమాండ్ ఉందని, మంచి ఆదాయం పొందడంతో పాటు, పది మందికి ఉపాధి చూపించవచ్చని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన గిరిజన యువతీ, యువకులకు ఐటీడీఏ సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యానవన అధికారి గుడిమళ్ల సందీప్‌కుమార్, సీడబ్ల్యుఎస్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, ట్రైనర్లు రమేష్, శ్రీకాంత్, సిబ్బంది శ్యామల,అశోక్, తిరుపతి, దిగంబర్, కైలాష్‌నాగోరావ్, దివ్యజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు మెరుగైన వైద్యం, విద్య అందించాలి

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న గిరిజన పిల్లలకు మెరుగైన వైద్యం, విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

అలాగే, జాతీయ స్థాయి ఖోఖో, హాకీ పోటీలకు ఎంపికైన ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడల పాఠశాల క్రీడాకారులను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఘనంగా సన్మానించారు.

● లఖింపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, ఆపఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం, అలాపహారం కలుషితంకాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త అన్నారు. బుధవారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టల్స్, స్కూల్స్‌లలో భోజనం వండడానికి ముందే ప్రతిరోజు క్రమంతప్పకుండా ఆహార పదార్థాలను క్షుణంగా తనిఖీ చేయాలని, నాసిరకం, నాణ్యత లేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని ఆదేశించారు. అంతకుముందు విద్యార్థులతో మాట్లాడుతూ ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ఎలా ఉంది, ఇంకా ఏమైనా అవసరం ఉన్నాయా, భోజనం ఎలా ఉంది అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.



తేనెటీగల శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీఓ ఖుష్బుగుప్త



లఖంపూర్ ఏహెచ్ఎస్‌లో రికార్డులను పరిశీలిస్తూ..

యువ వికాసంకు తరలిన యువకులు

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా 4వ రోజు బుధవారం యువ వికాసం కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా పెద్దపల్లిలో నిర్వహించనున్న యువ వికాసం కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనగా.. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో యువకులు ప్రత్యేక బస్సుల్లో తరలి వెళ్లారు. ఈ బస్సులను అదనపు కలెక్టర్ శ్యామలాదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతితో మరింత బాధ్యతలు : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయని ప్రతీఒక్కరు మరింత ఉత్సాహంగా విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. నేరస్థుల వేలి ముద్రలను కనుగొనడంలో పేరొందిన పి.శ్రీనివాస్ ఫింగర్‌ప్రింట్ ఏఎస్సై 20 సంవత్సరాలు ఆర్మీలో విజయవంతంగా ఉద్యోగం నిర్వహించి 2020లో ఫింగర్ ప్రింట్ ఏఎస్సైగా తెలంగాణ రాష్ట్ర పోలీసు వ్యవస్థలోకి అడుగు పెట్టారన్నారు. ప్రస్తుతం ఎస్సైగా పదోన్నతి పొందడం జరిగిందని తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం పదోన్నతి స్టార్ చిహ్నాన్ని పి.శ్రీనివాస్ భుజాలపై అలంకరించి అభినందించారు. అనంతరం జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం మాట్లాడుతూ పదోన్నతితో బాధ్యతలు పెరుగుతాయని, మరింత పనితనాన్ని ప్రదర్శిస్తూ జిల్లా పోలీసు కీర్తిని పెంపొందించాలని తెలిపారు. పి.శ్రీనివాస్ గతంలో 20 ఏళ్ల పాటు ఆర్మీలో ఉద్యోగం నిర్వహించి పదవి విరమణపొంది ప్రస్తుతం తెలంగాణ పోలీసు వ్యవస్థకు సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ రమేష్, సిబ్బంది గణేష్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఇచ్చోడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. బుధవారం ఇచ్చోడలోని వైటీసీ భవనంలో పాఠశాల సిబ్బందికి సమావేశాన్ని నిర్వహించి ఈ విషయమై అవగాహన కల్పించారు. నాణ్యతలేని కూరగాయలు, గడువు దాటిన పదార్థాలు వండి పెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబంబది పాల్గొన్నారు.



ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌కు సమస్యలను విన్నవిస్తున్న బీజేపీ నాయకులు

మా గ్రామ సమస్యలు పరిష్కరించాలి

● ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌కు తాంసివాసుల వినతి

తాంసి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని వీటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలంటూ తాంసికి వచ్చిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయకు పలువురు బీజేపీ నాయకులు, గ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు. బుధవారం తాంసి గ్రామానికి వచ్చిన ఆయనకు గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను చూపించారు. ప్రాథమిక పాఠశాల ఆవరణ ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యార్థులకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. రేషన్ సరుకుల బియ్యం లారీ రావడానికి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని రోడ్డును బాగు చేయించాలని సూచించారు. గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం అసంపూర్తిగా ఉందని, వెంటనే పూర్తి చేసే చర్యలు చేపట్టాలని వివరించారు. గ్రామంలో సరైన మురికి కాలువలు లేవని, రోడ్లను కూడా నిర్మించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అనంతరం ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను పరిశీలించారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారితో పేర్కొన్నారు. ఇందులో మాజీ ఉప సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి, నాయకులు సుధాకర్ యాదవ్, కిషన్, భగవాన్లు, రాములు, తదితరులు ఉన్నారు.



ప్లకార్డు పట్టుకున్న ఎమ్మెల్యే పాయల శంకర్

హిందువుల ఐక్యతను చాటాలి : పాయల

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువుల పై జరుగుతున్న దౌర్జన్యాలు తక్షణమే ఆగాలని, ఇస్కాన్ ప్రతినిధి చిన్మయి కృష్ణదాస్‌ను అన్యాయమైన జైలు శిక్ష నుంచి విముక్తి చేయాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందు ఐక్య వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో సంఘీభావ సభ నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు మాటదిపతి శ్రీయోగానంద సరస్వతి, పలువురు హిందూ సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అమానవీయ హింసలు ఆందోళనకరమని అన్నారు. దాడి ఘటనలను ఆపేందుకు అక్కడి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదని, బంగ్లా ప్రభుత్వ నిస్సహాయత కారణంగా హిందువులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ పీఠాధిపతి హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగ్‌లలో ఈనెల 5నుంచి 8 వరకు పత్తి పంట కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్, చైర్మన్ బి.గంగారెడ్డి తెలిపారు. జిన్నింగ్‌లలో పత్తి పంట నిల్వలు పేరుకుపోయినందున రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మార్కెట్ పత్తి పంటను తీసుకురావద్దని సూచించారు.

'గత పదేళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు'

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రజాసేవ భవన్‌లో రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలించి ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని పలు ఆరోపణలు చేశారు. ఇందులో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, నాయ కులు గిమ్మ సంతోష్‌రావు, లోక ప్రవీణ్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగెల నర్సింగ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్‌గౌడ్, ఇజ్జగిరి సంజయ్‌కుమార్, అల్చెట్టినాగన్న, తదితరులున్నారు.

'ఇందిరా ఫెలోషిప్‌తో మహిళల చైతన్యం'

మావల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ హక్కులు, రాజకీయంగా, సామాజికంగా, ఉద్యోగపరంగా హక్కుల కోసం పోరాటం చేయడానికి ఒక వేదిక కావాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు శక్తి అభియాన్ సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ తెలిపారు. మావల గ్రామంలోని తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో శక్తి అభియాన్, ఇందిరా ఫెలోషిప్ జాతీయ శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శక్తి అభియాన్ జాతీయ చైర్మన్ మణిశర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ చట్టాలపై న్యాయవాది పెందూర్ గోపి, ఆదివాసీ ఉద్యమాలపై మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, అటవీ హక్కులపై మహేందర్, మహిళలు వ్యవసాయంలో రాణించటం ఎలా అనే దానిపై కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి వివరించారు.



సిరికొండలో మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో నాగస్వామి



ఇంద్రవెల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్‌వో సంతోష్

అడవుల సంరక్షణ.. అందరి బాధ్యత

● ప్రజా పాలన ఉత్సవాలలో అటవీ శాఖ అధికారులు

ఉట్నూర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అడవులు సంరక్షించుకునే సామాజిక బాధ్యత అందరిపై ఉందని అటవి శాఖ అధికారులు ఈర్ల అరుణ, శిలానంద్‌లు అన్నారు. ప్రజాపాలన ఉత్సవాల సందర్భంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అడవుల సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు అడవికి నిప్పుఎట్టడం మహాపాపమని, అడవులకు నిప్పుపెడితే వన్యప్రాణులకు కూడా ఇబ్బందిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ప్రియాంక, సీతారాం,ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు గోపాల్‌సింగ్, ప్రేమ్‌సింగ్‌లతో పాటు ప్రధానోపాధ్యాయులు జాదవ్‌రమేష్‌లు పాల్గొన్నారు. అనంతరం ఉట్నూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

● అటవీ జంతువులకు హాని కలిగించవద్దు

నార్నూర్(ఆంధ్రజ్యోతి): అటవి విస్తీర్ణం, వన్యప్రాణులను సంరక్షించడం, వాటి సంఖ్యను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అటవి శాఖ అధికారి జాదవ్ సుదర్శన్ అన్నారు. ప్రజా పాలన ఉత్సవాల సందర్భంగా అటవి శాఖ అధికారులు బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుంచి జిల్లాలో పులి రావడంతో చాలా గ్రామాలలో ప్రజలు భయపడుతున్నారని, ప్రస్తుతం నార్నూర్, గాదిగూడ మండలో పులి సంచారం లేదని, పుకార్లు నమ్మవద్దు అన్నారు. వారి వెంటే అధికారులు అనిల్‌జాదవ్ సుజాత గ్రామస్థులున్నారు.

● మనం ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుంది

సిరికొండ(ఆంధ్రజ్యోతి): అడవులు మానవుడితోపాటు సకల జీవకోటి మనుగడకు ఆధారమని, అటవి సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైన ఉందని సిరిచెల్మ అటవీ క్షేత్రాధికారి నాగస్వామి అన్నారు. బుధవారం మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అడవులు, ప్లాంటేషన్‌లు అగ్నికి ఆహుతి అయితే పర్యావరణానికి విఘాతం కల్గుతుందని అన్నారు. దీంతో మానవాళికి మనుగడతో పాటు ఇతర జీవరాశులకు నష్టం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవో రవీందర్, ఎంఈవో సునీల్, డిప్యూటీ రేంజ్ అధికారి గిరయ్య, మాజీ సర్పంచ్‌లు ఒరగంటి పెంటన్న, అనిల్ కుమార్, ఏఎస్సై అశోక్, సెక్షన్ ఆఫీసర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

● అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు

ఇంద్రవెల్లి(ఆంధ్రజ్యోతి): అడవులకు నిప్పు పెట్టడం వల్ల మానవాళికి ముప్పు ఏర్పడుతుందని అటవీ శాఖ ఎఫ్ఆర్‌వో సంతోష్ అన్నారు. ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాలలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని అటవీ శాఖ ఆధ్వర్యంలో జడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులతో కలిసి అటవీ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ర్యాలీ చేపట్టారు.

పలుచోట్ల పోలింగ్ బూత్‌ల పరిశీలన

తాంసి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఏర్పాటు చేసే పోలింగ్ బూత్‌లను బుధవారం మండల అధికార యంత్రాంగం పరిశీలించారు. మండలంలోని అంబుగావ్, గిరిగావ్, పాలుడి గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ బూత్‌లు ఏ మేరకు ఉపయోగపడతాయో పరిశీలించారు. ప్రజలకు ఓటు వేసేందుకు సౌకర్యంగా ఉన్నాయో లేవో క్షుణ్ణంగా పరిశీలించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఎలాంటి అవాంతరాలు కలుగకుండా ఉండేందు కోసం ఇప్పటి నుంచి తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

తలమడుగు(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే గ్రామ పంచాయితీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎంపీవో చిలుకూరి సుధీర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో గ్రామ పంచాయితీ ఎన్నికలను నిర్వహిస్తున్నందున ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తున్నామన్నారు. మండలంలో 29 గ్రామ పంచాయితీలకు గాను 238 గ్రామ వార్డులు ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఇప్పటి నుంచి ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఎన్నికల కోసం ఓటరు జాబితా సిద్ధంగా ఉందన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు.

సోనాలలో ప్రభుత్వ భవనాల పరిశీలన

బోథ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన సోనాల మండల కేంద్రంలో వసతుల కల్పనకు బుధవారం అధికారులు నడుం బిగించారు. అందులో భాగంగానే ఎంపీడీవో రమేష్‌తో పాటు తహసీల్దార్ సుభాష్‌చంద్ర, ఎంపీఈవో జీవన్‌రెడ్డిలు గ్రామస్తులతో రైతు వేదికలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ భవనాలకు అవసరమైన స్థలాలను పరిశీలించారు. అంతేగాక తాత్కాలిక భవనాల కోసం ఉన్న వసతులను సమీక్షించారు. దీంతో గ్రామస్థులు, రెవెన్యూ మండలం ఏర్పాటు విషయంలో పూర్తిస్థాయిలో సందిగ్ధం తొలగిపోవడంతో పాటు అడుగుముందుకు పడుతోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో మాజీ సర్పంచ్ సదానందం, కాంగ్రెస్ నాయకులు గాజుల పోతన్న, మాజీ ఎంపీటీసీ లంక లలిత, మాజీ ఉప సర్పంచ్ కె.మురళితో పాటు గ్రామానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హయాంలో పేదలకు న్యాయం'

బోథ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ హయాంలో పేద ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందని వారి సంక్షేమం కోసం పథకాలను అమలు చేస్తున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఏడాది పాలన విజయోత్సవాల కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రిమ్స్‌లో మెడికల్ మాఫియా

(5వ పేజీ తరువాయి...)

తీవ్రంగా మందుల కొరత ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో కొన్ని రకాల చికిత్సలకు వైద్య సేవలు చేసే పరిస్థితి లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. చిన్నపాటి రోగం వచ్చినా.. బయటి నుంచే మందులను కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులకు ప్రిస్క్రిప్షన్ చీటీలు రాస్తూ.. బయట నుంచి మందులను తెచ్చుకోవాలంటూ కొందరు వైద్యులే సూచిస్తున్నట్లు రోగులు చెబుతున్నారు. ఉచిత వైద్యమని రిమ్స్ ఆసుపత్రికి వస్తే మందుల కొనుగోలుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో నిరుపేద రోగులు, వారీ బంధువులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వమే ఉచితంగా వైద్యం, అవసరమైన మందులను సరఫరా చేస్తున్నా.. వైద్యులు మాత్రం ప్రైవేట్‌కు పంపడంపై రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని అడిగితే రిమ్స్‌లో ఇదంతా మామూలేనని సమాధానం ఇస్తున్నారని చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, కొందరు వైద్యులు అక్రమ సంపాదనకు అలవాటు పడడంతో రిమ్స్ ఆసుపత్రిలో తీవ్రంగా మందుల కొరతకు దారి తీస్తున్నట్లు తెలుస్తుంది.

చీటీలను బట్టి పంపకాలు

ప్రైవేట్ మెడికల్ షాపులకు వైద్యులు పంపుతున్న ప్రిస్క్రిప్షన్ చీటీలను బట్టి నిత్యం పంపకాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. దీంతో కొంత మంది వైద్యులు పోటీ పడి మరీ ప్రైవేట్ మెడికల్ షాపులకు రోగులను రెఫర్ చేస్తున్నట్లు విమర్శలు లేకపోలేదు. తెల్లకాగితాలపై ప్రత్యేక కోడ్ భాషలో ప్రిస్క్రిప్షన్ చీటీలు రాయడం కొంతమంది వైద్యులకు అలవాటుగానే మారిందంటున్నారు. అలాగే వివిధ రకాల రంగులతో కూడిన ప్రిస్క్రిప్షన్ చీటీలను రాయడం వెనుక పెద్ద తతంగమే నడుస్తున్నట్లు తెలుస్తుం ది. దీంతో మెడికల్ షాపు నిర్వాహకులు రంగును చూసి వైద్యుడి పేరు చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోందంటున్నారు. దీని ప్రకారమే మెడికల్ మందుల కమీషన్ పంపకాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులకు ఎలాంటి అనుమానం రాకుండా ఈ రకమైన ప్రిస్క్రిప్షన్ చీటీల భాగోతం నడుస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. తేలికగానే తీసుకోవడంపై మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జ్వరంతో యువతి మృతి

ఇంద్రవెల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జ్వరంతో యువతి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని పిట్టబొంగరం గ్రామ పంచాయితీ పరిధిలోని ఓల్‌మద్రి గ్రామంలో జరిగింది. కుటుంబీకులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఓల్‌మద్రి గ్రామానికి చెందిన వెట్టి జాకు, భారతి బాయి దంపతుల కూతురు వెట్టి శ్రీదేవి(19) గత మూడు నెలల నుంచి తిర్యాని మండలంలో ఉంటున్న బంధువుల వద్దకు వెళ్లి ఉంటోంది. 15 రోజులుగా జ్వరంతో బాధపడగా.. రెండు రోజుల క్రితం ఓల్‌మద్రి గ్రామానికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారు జామున ఇంట్లోనే మృతి చెందినట్లు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి పెంకుటిల్లు దగ్ధం

ఇంద్రవెల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమై తీవ్రంగా నష్టపోయిన సంఘటన బుధవారం మండల కేంద్రంలోని చిచ్‌దరి, ఖానాపూర్ రోడ్డు జామా మసీదు పక్కన చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన షేక్ సలీం ఇంట్లో గ్యాస్ లీక్ కావడం వల్ల దట్టమైన పొగలతో, మంటలతో చెలరేగడంతో బయటకు పరుగులు తీశారు. ఇంట్లో ఉన్న బియ్యం, నిత్యావసర సరుకులు, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. రూ.90 వేల మేర ఆస్తి నష్టం వాటిలికలందని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జిన్నింగ్ మిల్లు కన్వర్ బెల్ట్‌పై పడి ఒకరి మృతి

ఇంద్రవెల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిన్నింగ్ మిల్లు కన్వర్ బెల్ట్‌పై పడి మిల్లు యజమాని తండ్రి మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, ఎస్సై దుబ్బాక సునీల్ వివరాల ప్రకారం.. గాలియబాయి తండా సమీపంలో గల విజయలక్ష్మీ జిన్నింగ్ మిల్లు యజమాని తగ్రే జ్ఞాన్‌సింగ్ తండ్రి తగ్రే పరశురాం రోజులాగే మిల్లులో పర్యవేక్షణ చేస్తున్నాడు. కాగా, కన్వర్ బెల్ట్ వద్ద జామ్ అయిన పత్తిని తొలగించే క్రమంలో గాయాల పాలయ్యాడు. ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

ఉత్తమ ఫలితాలకు తల్లిదండ్రులదే కీలక పాత్ర

● కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్

దిలావర్‌పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పి. సుదర్శన్ అన్నారు. ఇంటర్మీడియట్ కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ మాట్లాడుతూ... ఒక విద్యార్థిగా కళాశాలకు క్రమం తప్పకుండా హాజరుకావడం విద్యార్థి విధి అని, తమ పిల్లలను కళాశాలకు పంపడం తల్లిదండ్రుల బాధ్యత అని గుర్తించాలన్నారు. ప్రైవేట్ కళాశాలలకు ఏ మాత్రం తీసి పోకుండా మన ప్రభుత్వ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అయితే విద్యార్థులను ప్రతి రోజు కళాశాలకు పంపడంతో పాటు ఇంటి వద్ద వారు ప్రశాంతంగా చదువుకునే వాతావరణం కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రభుత్వం ఉచిత విద్య, పుస్తకాలు, స్కాలర్‌షిప్ సౌకర్యం, సైన్స్ విద్యార్థులకు ఈఏపీసెట్ కోసం ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి నోట్స్ చూడటంతో పాటు విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు 90 రోజుల ప్రణాళికను అధ్యాపకులతో సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు ఆనందం, ఇతర అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష రాసి వచ్చేలోపు.. ఫోన్‌ల మాయం..

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 04 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ పరీక్ష రాసి వచ్చేలోపు బైక్ టూల్ బాక్స్‌లో పెట్టుకున్న నాలుగు ఫోన్‌లు మాయమైన ఘటన ఆదిలాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సైన్స్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న నలుగురు విద్యార్థులు డిగ్రీ పరీక్ష రాయడానికి బుధవారం నలంద కళాశా పరీక్షా కేంద్రానికి వచ్చారు. కాగా తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లను ద్విచక్ర వాహనంలోని టూల్ బాక్స్‌లో ఉంచి లాక్ వేసి పరీక్ష రాయడానికి వెళ్లారు. పరీక్ష రాసి తిరిగి బైక్ వద్దకు వచ్చిన చూడగా ఫోన్‌లు కనిపించకపోవడంతో విద్యార్థులు ఒక్కసారిగా కంగుతున్నారు. దీనిపై మావల పోలీసులకు తెలిపారు. సెల్‌ఫోనులు పోగొట్టుకున్న వారు ఐఎంఈ నెంబర్ల ద్వారా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసుకుంటే పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు దొరికే అవకాశం ఉందని ఎస్సై విష్ణువర్ధన్ తెలిపినట్లు బాధితులు పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

● ఎమ్మెల్యే రామారావుపాటిల్

తానూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే రామరావుపాటిల్ అన్నారు. బుధవారం మండలంలోని తరోడా గ్రామంలో సమీకృత వ్యవసాయ క్షేత్ర పథకంలో భాగంగా ఫిస్ పాండ్‌లో చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం ఫిస్‌పాండ్ ఏర్పాటు ఏసి వాటికి నిధులు కేటాయించి రైతులకు అండగా ఉంటుందన్నారు. రైతుల కోసం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు మహిళ సంఘాల్లో రుణాలు తీసుకొని స్వయం ఉపాధిపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవోపీడీ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శివకుమార్, ఎంపీవో శిరీష, ఏపీఎం గురుచరణ్, ఏవోఏ ఓమేష్, నాయకులు నర్సాగౌడ్, రవికిరణ్, సాయిరాం, నిమ్మ పోతన్న, దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

బాసరలో విజయోత్సవ పూజలు

బాసర, డిసెంబరు, 4: (ఆంధ్రజ్యోతి) : ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా బాసర అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యాసమహర్షి ఆలయంలో చండియాగం నిర్వహించారు. దేవస్థాన అర్చక పండితులు వివిధ కార్యక్ర మాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ విజయ రామరావు, చైర్మన్ శరత్ పాఠక్, తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళకు పోలీసుల సాయం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లో మూడు రోజులుగా మతిస్థిమితం లేని ఓ మహిళ దిగంబరంగా తిరగడం గుర్తించిన పోలీసులు ఆమెకు వస్త్రాలు సమకూర్చి మానవత్వం చాటారు. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై బిట్ల పర్సెస్, బ్లూ కోర్టు సిబ్బంది అజహర్, రాథోడ్ అనిల్‌లను అభినందించారు.

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ మోసం : బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జ్



ఖానాపూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

ఖానాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించి కాంగ్రెస్ గద్దెనెక్కిందని బీజేపీ రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్, ఆదిలాబాద్ పార్ల మెంట్ ఇంచార్జ్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జ్ రావుల రాం నాథ్‌లు మండిపడ్డారు. ఖానాపూర్‌లో బుధ వారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏడా ది వైఫల్యాలపై 'కాంగ్రెస్ గ్యారం టీల గార డీ... ఆరు అబద్ధాలు 66 మోసాలు'.. పేరిట నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సం దర్భం గా బీజేపీ రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తెలం గాణ చౌక్‌లో బీజేపీ జెండా ఆవిష్కరించి నిరసన దీక్షను ప్రారంభించారు. దీక్షా శిబి రంలో పలువురు నేతలు ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో నాడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ చేసిన తప్పుల కంటే నేడు కాంగ్రెస్ ఒక అడుగు ముందుకేసి రెట్టింపు తప్పులను చేస్తుందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని వారన్నారు. రైతు భరోసా, రైతు రుణ మాఫీ, కళ్యాణ లక్ష్మిలో తులం బంగారం, పింఛన్ల పెంపు, సహా ఇచ్చిన హామీలన్నిం టినీ తుంగలో తొక్కి, తెలంగాణ ప్రజలను మోగించారని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆకుల శ్రీనివాస్, అంకం మహేందర్, ఖానా పూర్ మండల అధ్యక్షులు టేకు ప్రకాష్, పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్, తోకల బుచ్చన్న యాదవ్, దస్తురాబాద్ మండల అధ్యక్షులు లక్ష్మణ్, ఉట్నూర్ మండల అధ్యక్షులు లింగాగౌడ్, కడెం మండల అధ్యక్షులు శ్రీనివాస్, పెంబి మండల అధ్యక్షులు వెంక టేష్, రాజశేఖర్, అనిల్‌రావు, గోపాల్‌రెడ్డి, గడ్డం రవీందర్, కిష్టయ్య, ఉపేందర్, ఎడ్ల రాజేశ్వర్, తదితరులున్నారు.

'బీఆర్ఎస్ విద్యార్థి నాయకుల తీరు సరికాదు'



మాట్లాడుతున్న ఒడ్నాల రాజేశ్వర్

లక్ష్మణచాంద, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న పాఠశాలలు, కళాశాలలను బీఆర్ఎస్ విద్యార్థి నాయకులు పరిశీలించటం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థుల ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రస్తుతం ఆ పార్టీ విద్యార్థి విభాగం చేత పరిశీలన పర్యటనలు చేయటం విడ్డూరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటం కోసం వేలాది ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేశామన్నారు. పాఠశాల మరమ్మతులతో పాటు అదనపు గదులను నిర్మించామన్నారు.

లక్ష్మణచాందకు 108 వాహనం...

లక్ష్మణచాంద మండల ప్రజల కోసం నిర్మల్ డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు సహకారంతో ప్రత్యేకంగా 108 వాహనం మంజూరు అయ్యిందన్నారు. తద్వారా మండల ప్రజలకు అత్యవసర సేవలందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటెల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుంకరి సురేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిరిపురం నాగేష్, బీసీ విభాగం మండల అధ్యక్షులు ఎం. వినేష్, లక్ష్మణచాంద గ్రామ కమిటీ అధ్యక్షులు సుంకరి గంగయ్య, తిరుపెల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు సొన్న భీమేష్, బిట్లింగ్ రజినీకాంత్, సమ్మెట రవి, ఎస్. సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగ హామీలు నెరవేర్చాలి

● ఎస్‌టీయూ రాష్ట్ర నేత సదానందం గౌడ్



మాట్లాడుతున్న సదానంద్ గౌడ్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి జి.సదానందం గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌టీయూ భవనంలో జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్ అధ్యక్షతన వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ... ఈ కుబేర్‌లో పెండింగు సమస్యలు జీపీఎఫ్, జీఐఎస్, మెడికల్, సరెండర్ లీవ్, రిటైర్మెంట్ బెనిఫిట్లు ఇతర బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో సర్వీస్ రూల్స్, ఎంఈవో, డిప్యూటీ ఈవో, జూనియర్ లెక్చరర్ల పదోన్నతులు సాధించినట్టు తెలిపారు. 317 జీవో అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల్లో పని చేసే సీఆర్టీలకు సెలవులతో పాటు మినిమమ్ టైం స్కేల్ ఇవ్వాలన్నారు. పెండింగ్ డీఏలు విడుదల పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు, తదితర సమస్యలపై సంఘం పోరాటం చేస్తుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జే. లక్ష్మణ్, రాష్ట్ర బాధ్యుడు జుట్టు గజేందర్, ఎన్. నాగభూషణ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రావు, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ బడిలో అన్నీ సమస్యలే!

- సమస్యల వలయంలో ఆదివాసీ గిరిజన ఆశ్రమ పాఠశాలలు
- డైనింగ్ హాల్‌లేక వరండాలో విద్యార్థుల భోజనం
- దుప్పట్లు లేక వణుకుతున్న స్టూడెంట్స్
- చన్నీళ్లతో స్నానం ● వంట షెడ్లు కరువు
- కనీస సదుపాయాలూ లేని వైనం



వరండాలో భోజనం చేస్తున్నవిద్యార్థులు

ఇంద్రవెల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాలకు చెందిన ఆదివాసీ గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆశ్రమ పాఠశాలలు నిర్వహణ లోపంతో ట్టుబ్టాడుతున్నాయి. అరకొర సిబ్బంది, వంట షెడ్లు, డైనింగ్ హాళ్ళు, సరిపడ మరుగుదొడ్లు, మూత్రశాలలు తదితర సౌకర్యాలు లేక విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోధనపై శ్రద్ధ తీసుకుంటున్నా సౌక్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరో పణలు వినిపిస్తున్నాయి. మండలంలోని అనేక పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, డైనిం గ్ హాల్, శుద్ధ జలం, వంట షెడ్లు తదితర సమ స్యలు వేధిస్తున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులకు వేడి నీళ్ళు అందించేందుకు ఏర్పాటు చేసిన సోలార్ వేడి నీటి యంత్రాలు చెడిపోయి ఏళ్ళు కావస్తున్నా అధికారులు మరమ్మ తులు చేయ డం లేదు. దీంతో విద్యార్థులు చన్నీళ్ళతోనే సరి పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం చలికాలం కావడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. పాఠశాలల్లో డైనింగ్ హాల్‌లేక పోవడంతో పాఠ శాల ఆవరణలోని చెట్ల కింద నీడలో, గదుల ముందు వరండాల్లో విద్యార్థులు భోజనాలు చేస్తున్నారు. వంటశాలలు లేకపోవడంతో వంట చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలికాలం ఆరంభంలో పంపిణీ చేసే దుప్పట్లు నేటి వరకు ఐటీడీఏ అధికారులు పంపిణీ చేయలేదు. దీంతో ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు చలికి గజగజవణుకుతూ కాలం వెళ్లదీస్తున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఉన్న కొన్నిచోట్ల అధ్వానంగా మారాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక పాఠశాలలకు డైనింగ్‌హాల్ లేకపోవడంతో అపరిశుభ్రత వాతావరణంలో వరండాలో, చెట్ల కింద భోజనాలు చేస్తుండడంతో తరచూ విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో డైనింగ్‌హాల్ లేక విద్యార్థులు వరండాలో భోజనం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.10 లక్షల వ్యయంతో డైనింగ్‌హాల్ భవన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఈ పనులు 30 శాతం పూర్తయినా కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో విద్యార్థినులకు అవస్థలు తప్పడం లేదు. డైనింగ్‌హాల్ అందుబాటులో లేకపోవడంతో వరండాలో భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే అనేక ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంవత్సరం ఆశ్రమ పాఠశాలల్లో అవసరం ఉన్నా తదితర నిర్మాణానికి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు పంపించడమే తప్పా నిధులు మంజూరై నిర్మాణాలు చేపట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆశ్రమ పాఠశాలల్లో అన్నివిధాల వసతులు కల్పించాలని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని, సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.


నిలిచిన డైనింగ్ హాల్ నిర్మాణ పనులు


అధ్వానంగా ఉన్న రేకుల షెడ్డు

ఆష్టలో కన్నుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపన

- పెద్ద ఎత్తున హాజరైన భక్తులు


విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు


హాజరైన భక్త జనం

భైంసా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని ముథోల్ మండలం ఆష్ట గ్రామంలో శ్రీ సీతారామలక్ష్మణ అంజనేయ సహిత ఆదిత్యాది నవగ్రహ పూర్వ ధ్వజ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రారంభమైన విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు గురువారం ముగియనున్నాయి. శ్రీశ్రీశ్రీ రంగంపేట పీఠాధీశ్వరులు జగత్ గురువులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు సశాస్త్రీయంగా త్రిదిన దీక్షచే సుప్రసిద్ధ వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. వేడుకలలో భాగంగా బుధవారం ప్రతిష్ఠాపాన విగ్రహాలకు వివిధ అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం నవ ధాన్యాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం వేళలో ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మూలమంత్ర జప,తర్పణ హోమములు , అఘోర, పిండికా, పౌష్టిక న్యాస హోమములు నిర్వహించారు. ధ్వజ స్తంబ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు చేపట్టారు. శోభాయాత్రలో గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పల్లెల్లో వెంటాడుతున్న పులి భయం

- ఎటు చూసినా పులిపై ప్రచారాలు
- 10 ట్రాకింగ్ కెమెరాల ఏర్పాటు
- అడవుల్లో ప్రత్యేక అటవీ బృందాలు

బోథ్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బోథ్ రేంజ్ పరిధిలో నెలరోజుల క్రితం అలజడి సృష్టించిన పులిని స్థానికులు ఇప్పటికీ మర్చిపోవడం లేదు. పొలం పనులకు వెళ్లి ఏ చిన్న అలజడి వచ్చినా పులి వచ్చిందంటూ అటవీ శాఖ అధికారులకు ఫోన్లు చేస్తున్నారు. దీంతో రాత్రిపూట గ్రామాలలో పులి గురించి చర్చలు , ప్రచారాలు కొనసాగుతున్నాయి.

● ప్రతీరోజు ఫోన్‌ లు...

ప్రతీరోజు పులి వచ్చిందంటూ పగలు, రాత్రి ఫోన్లు వస్తున్నాయని రేంజ్ అధికారి ప్రణయ్ తెలిపారు. వాస్తవానికి పొలంలో పనిచేసే రైతులు, కూలీలు ఏ చిన్న అలజడి అయినా పరుగులు తీస్తూ పులి వచ్చిందని ఫోన్లు చేయడం జరుగుతుందన్నారు. అయితే వారిచ్చిన సమాచారంతో తాము పొలాల్లోకి వెళ్ళి సిబ్బందితో కలిసి పాదముద్రలను పరిశీలిస్తున్నామన్నారు. అయితే చివరికి పులుల అడుగు జాడలు కనిపించకపోగా అడవి కుక్కలు, నక్కలు, పందుల అడుగుజాడలు కనిపిస్తున్నాయన్నారు.

● ప్రత్యేక బృందాల గాలింపు..

చిరుతలు, పులుల జాడ కోసం బోథ్ అటవీ ప్రాంతంలో ప్రత్యేక బృందాలు అనుభవజ్ఞులైన అటవీశాఖ సిబ్బందితో గాలింపు చర్యలు చేపడుతున్నామని రేంజ్ అధికారి వివరించారు. అంతేగాక అటవీ శాఖ అధికారులు వాటి ఆచూకీ కనుగొనేందుకు పది చోట్ల కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. చివరికి కెమెరాలకు చిక్కిన జంతువులను గ్రామాలలోకి వెళ్లి ప్రజలకు వివరిస్తే కొంత ధైర్యంగా చేనులకు వెళుతున్నారని అధికారులు చెబుతున్నారు..

● విద్యుత్‌ కంచెలతో....

ప్రస్తుతం రైతుల పొలాలలో పంటలతో పాటు కంది పంట సాగుతుంది. అయితే ఆయా పంటలను రక్షించుకునేందుకు కొంత మంది అటవీ సమీప గ్రామాల రైతులు సోలార్ విద్యుత్ కంచెలను అమర్చుకుంటుండగా మరికొంత మంది రైతులు విద్యుత్ కంచెలను సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో వన్యప్రాణాలకు విద్యుత్ కంచెల నుంచి ముప్పు ఏర్పడే ఆస్కారం ఉంది. అటవీ శాఖ అధికారులు ఈ విషయంలో రైతులకు పలు సూచనలు ఇస్తున్నారు. అయినా కొందరు రాత్రిపూట విద్యుత్ కంచెలను ఏర్పాటు చేసుకుంటున్నారని, ఇది సరి కాదని రైతులకు అధికారులు సూచిస్తున్నారు.


అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు


పాదముద్రలు సేకరిస్తున్న అటవీ శాఖ అధికారులు

కూతురి వివాహానికి రావాలని ప్రధానికి ఏలేటి ఆహ్వానం


ప్రధానికి శుభలేఖ అందజేస్తున్న ఏలేటి దంపతులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఎమ్మెల్యే, బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తన కూతురి వివాహానికి హాజరు కావాలని కోరుతూ బుధవారం ప్రధాని నరేంద్ర మోదీకి న్యూఢిల్లీలో ఆహ్వానపత్రిక అందజేశారు. ఆయన సతీమణి కవిత రెడ్డితో కలిసి ఈ నెల 11న హైదరాబాద్‌లో జరిగే పెద్ద కుమార్తె శాన్విత వివాహానికి హాజరు కావాలని ఈ సందర్భంగా కోరారు.

పీచరలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

లక్ష్మణచాంద, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీచర ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు ఇంటి వద్ద నుంచి ఇష్టమైన, ప్రత్యేకమైన వంటకాలు తయారు చేసుకొని వచ్చి కార్యక్రమం జరిపారు. పిల్లలు, పెద్దలు అందరూ జంక్ ఫుడ్ కోసం అలవాటు పడటం, పౌష్టిక, సంతులిత ఆహారంపై అవగాహన లేకపోవడం వలన విద్యార్థుల్లో పోషకాహార లోపం, స్థూలకాయత్వంగా తయారు కావడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు బి.గోదావరి తెలిపారు. విద్యార్థుల ఆహార అలవాట్ల పట్ల సరైన నియమ నిబంధనలు పాటిం చాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ అధ్య క్షుడు దాసరి శంకర్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


పీచరలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సత్తా చాటిన రవి హైస్కూల్ విద్యార్థులు


పతకాలు సాధించిన రవి స్కూల్ విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లో జరిగిన ట్రస్మా క్రీడా పోటీల్లో రవి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పలు విభాగాల్లో 4 బంగారు, 6 వెండి, 5 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. వాలీబాల్, ఖోఖో సీనియర్, జూనియర్ విభాగాల్లో ఛాంపియన్‌షిప్ సాధించి బాలబాలికలు ముందు భాగాన నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం తరఫున కరస్పాండెంట్ ఏ. వెంకటేశ్వర్ రావు అభినందించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన


గుండె పనితీరును వివరిస్తున్న విద్యార్థిని

ఖానాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మస్కాపూర్‌లో గల ఓ పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్‌లో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ స్టూడెంట్ లెడ్‌కాన్ఫరెన్స్‌లో ఒకటి నుంచి పదోతరగతి వరకు చదివే విద్యార్థులు 100కు పైగా ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు తాము చేసిన ప్రాజెక్టుల తాలూకు వివరాలను తల్లిదండ్రులు, అతిథులకు వివరించిన తీరు ఆకట్టుకుంది. విద్యార్థులు నిత్యం క్లాసులలో నేర్చుకున్న అంశాలను అద్భుతంగా వివరించి, వారి అభ్యసన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. గత మూడు సంవత్సరాలుగా స్టూడెంట్ లెడ్‌కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, విద్యార్థులకు సైన్స్ మ్యాథ్స్‌తో పాటు మిగతా సబ్జెక్టుల పట్ల ఆసక్తి కలిగేలా చేస్తున్నామని పాఠశాల డైరెక్టర్ మదిరే శ్రీనివాస్ తెలిపారు. ప్రాజెక్టులు చేయడానికి విద్యార్థులకు సహకరించిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ రాజేష్, ఉపాధ్యాయులు సుధాకర్, సుష్మిత, ప్రవళిక, గౌరీ, శైలజ, నవీన, రమ, రజిత, సౌజన్య, శ్వేత, స్రవంతి, ఇతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు న్నారు.


రాకెట్ పనితీరును వివరిస్తున్న విద్యార్థులు


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

ఏసీబీ వలలో మార్కెటింగ్ ఏడీ

- రూ.ఏడు వేల లంచం తీసుకుంటూ దొరికిన అధికారి
- ఆదిలాబాద్‌లోని శ్రీనివాస్ ఇంట్లోనూ ఏసీబీ సోదాలు

నిర్మల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో అవినీతికి పాల్పడుతున్న అధికారులు వరుసగా ఏసీబీకి పట్టుబడుతున్నారు. వారం రోజుల క్రితం సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ జగదీష్ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడిన ఉదంతం ఇంకా మరువకముందే తాజాగా బుధవారం నిర్మల్ జిల్లా మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్ అదే తరహాలో ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఇక్కడి జిన్నింగ్ మిల్లులో దడ్వాయిగా పని చేసే కుమ్మరి వెంకటేష్ అనే వ్యక్తికి సంబంధించి లైసెన్స్ రెన్యువల్ కోసం ఏడీ శ్రీనివాస్ పది వేల రూపాయలను డిమాండ్ చేశారు. అయితే బాధితుడు వెంకటేష్ 7 వేల రూపాయలు ఇచ్చేందుకు అంగీకరించి ఏసీబీకి ఫిర్యాదు చేశారు. బుధవారం ఇక్కడి మార్కెట్ కమిటీ ఆవరణలోని ఏడీ ఆఫీస్‌లో ఏడీ శ్రీనివాస్ 7 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏకకాలంలో ఏసీబీ అధికారులు ఆదిలాబాద్‌లోని ఏడీ శ్రీనివాస్ ఇంట్లో కూడా సోదాలు జరిపారు. కాగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ శ్రీనివాస్‌ను కరీంనగర్ కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి తెలిపారు. వారంలోనే ఇది రెండో కేసు కావడంతో పలు ప్రభుత్వ శాఖలలో కలకలం మొదలైంది.

ఏడాదిలో తొమ్మిది మంది పట్టివేత...


ఏడాదిలో మొత్తం తొమ్మిది మందికి పైగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. జనవరి 10వ తేదీన జిల్లాలోని కడెం మండల తహసీల్దార్ మేడికొండ రాజేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్లు చిన్నయ్యలు రైతు నుంచి 9 వేల రూపాయల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. అలాగే ఇదే నెలలో నిర్మల్ మున్సిపాలిటీలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసే గంగాధర్, బిల్ కలెక్టర్ నవంత్‌లు లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కారు మే నెల 22న భైంసా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ రావుతో పాటు బిల్ కలెక్టర్ విద్యాసాగర్‌లు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. నెలరోజుల క్రితం నిర్మల్ మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న షాకీర్ కూడా ఏసీబీ అధికారులకు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. ఈ ఘటనలు మరువకముందే వారం క్రితం సర్వే ల్యాండ్ రికార్డ్స్ జూనియర్ అసిస్టెంట్ జగదీష్ అలాగే అటెండర్ మహేష్‌లు ఏసీబీకి ట్రాప్ అయ్యారు. కాగా బుధవారం జిల్లా స్థాయి అధికారి అయిన మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్ కూడా ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.


నిర్మల్‌లో ఏసీబీకి పట్టుబడిన మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్

ఆదిలాబాద్‌లో సోదాలు..

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బ్రహ్మవాడలోని మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ ఇంట్లో కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇంట్లో ఉన్న కుటుంబసభ్యులను విచారించడంతో పాటు పలు పత్రాలు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఆస్తుల వివరాలు తదితర వాటి గురించి క్షుణ్ణంగా తెలుసుకొని నివేదిక తయారు చేసుకున్నారు. పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ సీఐ స్వామి తెలిపారు. అధికారులు దాడులు నిర్వహిస్తుండడంతో.. కుటుంబసభ్యులు ఆందోళన చెందారు.


ఆదిలాబాద్‌లోని ఏడీ శ్రీనివాస్ ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు





యాసంగి సాగుకు సర్వం సిద్ధం



సదర్మాట్ ఆనకట్ట (ఫైల్)

- ఇదివరకే ప్రణాళికలు సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ
- జిల్లాలో 3.02 లక్షల ఎకరాల్లో ఆయా పంటల సాగు
- 1.10 లక్షల ఎకరాల్లో వరి..1.02 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగుకు రైతన్న సిద్ధం
- యాసంగిలో 37 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు అంచనా
- యూరియా సమా డీఏపీ, 20-20 ఎరువులు అందుబాటులో ఉంచేలా అధికారుల చర్యలు
- ఇక యాసంగి పనులను షురూ చేయనున్నరైతన్న

ఖానాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిన్న మొన్నటి వానకాలంలో వేసిన వరి పంటను సేకరించడంలో తలమునకలైన రైతన్న ఇప్పుడు సేకరించిన పంట తాలూకు ధాన్యాన్ని విక్రయించే పనిలో బిజీ అయ్యాడు. ఇక ధాన్యం విక్రయించడంలో బిజీగా ఉన్న అన్నదాతలు మరోవైపు యాసంగి పంటకు సైతం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా నారు మళ్లను సిద్ధం చేసుకునే పనులను ప్రారంభించారు. యాసంగిలో నీటిఎద్దడిని దృష్టిలో ఉంచుకొని దీర్ఘ కాలపు పంటలు కాకుండా తక్కువ వ్యవధిలో చేతి కందే పంటల విత్తనాలను ఎంచుకుని వరినార్లు పోసుకునేందుకు రైతన్న సన్నద్ధం అవుతున్నాడు. వానకాలం పంట ద్వారా వచ్చే దిగుబడి రెండు పంటలకు అయ్యే పెట్టుబడి ఖర్చులకు పోతుందని ఇక యాసంగిలో వచ్చే పంట దిగుబడి రైతన్నకు ఆదాయంగా మిగులుతుందని యాసంగి పంటను భావిస్తారు. అటువంటి యాసంగి పంటకు కావలసిన విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ ఏడాది యాసంగిలో 3.02 లక్షల ఎకరాల్లో ఆయా పంటలను సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదివరకే యాసంగి సాగుకు కావలసిన ప్రణాళికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికను పంపించారు. యాసంగి పంటకు కావలసిన ఎరువులను, విత్తనాలను సకాలంలో అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది.

యాసంగి సాగు లక్ష్యం 3.02 లక్షల ఎకరాలు

జిల్లాలో ఈ ఏడాది యాసంగి సాగు లక్ష్యాన్ని 3.02 లక్షల ఎకరాలుగా అధికారులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 3.02 లక్షల ఎకరాల్లో ఆయా రకాల పంటలను సాగు చేయనున్నట్లు చెబుతున్నారు. ఈ యాసంగిలో 1.10 లక్షల ఎకరాల్లో వరి పంట, 1.02 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంట, 35 వేల ఎకరాల్లో జొన్న పంట, 55 వేల ఎకరాల్లో శనగ పంట, 1000 ఎకరాల్లో పల్లి, పొద్దు తిరుగుడు ఇతర పంటలను సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో సాగు చేయనున్న ఆయా రకాల పంటలకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసి ఇదివరకే ప్రభుత్వానికి పంపినట్లు అధికార యంత్రాం గం చెబుతోంది.

ఎరువులు, విత్తనాలు సిద్ధం

ఈ యాసంగిలో సాగు చేయ నున్న పంటల తాలూకు విత్తనా లను, ఎరువులను సిద్ధంగా ఉంచేందుకు ప్రణాళికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పం పినట్లు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సాగు చేయనున్న వరి, మొక్కజొన్న, జొన్న, శనగ, పల్లి, పొద్దు తిరుగుడు, తదితర పంటల తాలూకు విత్తనాలు, ఎరువులు సరిపడా మార్కెట్‌లో సిద్ధంగా ఉంచేలా చర్యలు చేపట్టినట్లు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 37 వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, 14 వేల మెట్రిక్ టన్నుల 20-20 లాంటి ఎరువులు ప్రధానంగా అవసరం పడతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఎరువులను నెలవారి అవసరాల ప్రకారం మార్కెట్‌లో అందుబాటులో ఉంచుతామని చెబుతున్నారు.



నాటు వేసేందుకు సిద్ధం చేసిన బురద మడి (ఫైల్)

ఆశాజనకంగా నీటి వనరులు

గతంతో పోలిస్తే ఈ ఏడాది యాసంగిలో ఆయా పంటల సాగుకు నీటి వనరులు ఆశాజనకంగా కనిపిస్తుండటంతో రైతులు యాసంగిపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి పంటతో పాటు మొక్కజొన్న, జొన్న, శనగ, పల్లి, పొద్దుతిరుగుడు లాంటి పంటలు సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్న నేపథ్యంలో ఇందులో అధికంగా వరి, మొక్కజొన్న సాగు చేయనున్నారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలో యాసంగికి సరిపడా నీరు అందుబాటులో ఉన్నట్టు అధికార వర్గాలు వెల్లడిస్తున్న నేపథ్యంలో వరి పంట సాగు చేసే రైతు లకు నీటిఎద్దడి ఉండ క పోవ చ్చని చె బు త న్నా ర ు. ఎస్సారెస్పీతో పాటు గడ్డెన్నవాగు, స్వర్ణ, కడెం ప్రాజెక్టులలో నీరు పుష్కలంగా ఉండడంతో యాసంగి ఎటు వంటి రంది లేకుండా సాగ నుందనే అభిప్రాయాలను అ న్నదాతలు వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సకాలంలో విత్తనాలను, ఎరువులను అందుబాటులో ఉంచ గలిగితే ఈ యాసంగి అన్నదాతకు ఆశించిన లాభా లను తెచ్చిపెడుతుందని అంచనా వేస్తున్నారు.

అవసరం మేరకు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతాం

జిల్లావ్యాప్తంగా ఈ యాసంగి లో 3.02 లక్షల ఎకరాల్లో ఆయా రకాల పంటలను సాగు చేయనున్నారు. ఇదివరకే ఈ పంటల తాలూకు ప్రణాళికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం. అవసరానికి సరిపడా ఎరువులను, విత్తనాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతాం.

అంజి ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

చెరువు మరమ్మతు చేస్తాం



కుంటాల మండలం వెంకూర్ చెరువును పరిశీలిస్తున్న ఆదిలాబాద్ ఇరిగేషన్ ఛీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్

కుంటాల, డిసెంబరు, 4 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని వెంకూర్ చెరువును బుధవారం ఆదిలాబాద్ ఇరిగేషన్ ఛీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకూర్ చెరువు మరమ్మతులు చేపట్టి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని పేర్కొన్నారు. గతంలో అధికారుల నిర్లక్ష్యం వలన ఇక్కడి రైతులకు అన్యాయం జరిగింది. రాబోయే రోజుల్లో వెంకూర్ గ్రామస్థులతో పాటు రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని తెలిపారు ఈ సందర్భంగా చెరువు నిర్మించిన కాంట్రాక్టర్లపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం నాణ్యతలోపం కారణంతో గత కొద్ది రోజుల నుండి ఇక్కడి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని చెరువు మరమ్మతుల పనుల కోసం రీ ఎస్టిమేషన్ పంపి మరోమారు పూర్తి స్థాయిలో చెరువు పనులు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రవీందర్, ఈఈ అనిల్, ఏఈ మీరాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

కల్లూరులో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



కుంటాల మండలం కల్లూరులో ఇందిరా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో విజయలక్ష్మీ

కుంటాల, డిసెంబరు, 4: (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో బుధవారం డీఆర్‌డీవో విజయలక్ష్మీ మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాల ఆర్థిక పరిపుష్టి కోసం ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని మహిళా సంఘాల సభ్యులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ప్రజా పాలన ఉత్సవాల్లో భాగంగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా సంఘాల బలోపేతం కొరకు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం అశోక్, సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు, వీఓఏలు మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

పంచాయతీ రికార్డుల తనిఖీ చేసిన డీపీవో

నర్సాపూర్(జి), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బుధవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మురికి కాలువలు, సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. గ్రామ స్థాయిలో ఈ నెల 7, 8న సీఎం కప్ పోటీలు ఉన్నందున ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీవో తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్ ఉన్నారు.

అడిషనల్ కలెక్టర్ ముమ్మర ఆకస్మిక తనిఖీలు



ప్లాస్టిక్ విక్రయ కేంద్రాల్లో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తనిఖీ



తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

భైంసా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ బుధవారం ముమ్మరంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం వేళలో జిల్లా కేంద్రం నుంచి ఇక్కడకు వచ్చిన అడిషనల్ కలెక్టర్ పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటనలు చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం ప్రధాన మార్కెట్లో పర్యటించి దుకాణ సముదాయల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపుల లైసెన్స్‌లను పరిశీలించారు. ప్లాస్టిక్ విక్రయ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టి సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులను గుర్తించి సంబంధిత షాపులకు జరిమాన విధింప చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అనీస్‌లకు పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుదలకు మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దుకాణానికి సంబంధించి మున్సిపల్ నుంచి లైసెన్స్ తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్థానిక కేజీబీవీ పాఠశాలకు వెళ్లి తనిఖీ చేశారు. వంటగది, బోజనశాల నిర్వాహణ వ్యవస్థను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లోని సరుకులను పరీక్షించారు. అనంతరం నిర్వాహణ వ్యవస్థను పర్యవేక్షించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సుబాష్‌ను నిత్యం పాఠశాలలు, వసతి గృహల్లో పర్యటించి భోజన, నిర్వాహణ వ్యవస్థను పర్యవేక్షించాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు. అక్కడి నుంచి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి కుటుంబ సర్వే ఆన్ లైన్ నమోదు వ్యవస్థ పర్యవేక్షించారు. ఇక్కడ ఎంపీవో మహమ్మద్ మోజం హుస్సేన్ కాలయాపనకు తావు లేకుండా కుటుంబ సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎంపీడీవో కార్యాలయంలో..

భైంసా రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆకస్మిక తనిఖీ చేశారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలు పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. రికార్డులు పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ఎంపీవో మోజాం హుస్సేన్, టీఏలు, తదితరులు పాల్గొన్నారు.

అటవీరక్షణ..వన్య ప్రాణులపై అవగాహన



లబ్ధిదారులకు నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

సారంగాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించోలి(బి) సమీపంలో గల గండిరామన్న హరితవనంలో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం సంబంధిత అధికారులకు అటవీ రక్షణ వన్య ప్రాణులపై చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బాసర సర్కిల్ శర్వానన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అటవీ ప్రాంతాలను కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. అటవీ జంతువులకు ఎలాంటి ప్రాణ హాని కలిగించవద్దని, అటవీ జంతువులు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు. అటవీ రక్షణతో పాటు అటవీ ప్రాంతంలో జరిగే అగ్ని ప్రమాదాలను నివారించాలని పేర్కొన్నారు. అనంతరం గతంలో వన్య ప్రాణుల్లో గాయపడ్డ లబ్ధిదారులకు నష్టపరిహారం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు నాగిని భాను, రవీందర్, రామకృష్ణరావు, శ్రీనివాస్‌రావు, అవినాష్, వేణుగోపాల్, అనిత, నజీర్‌ఖాన్, సంతోష్ కుమార్‌లు ఉన్నారు.

మోకాళ్లపై నిలబడి మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో కోడిగుడ్ల బిల్లులు చెల్లించడం లేదని, రెండు వేల వేతనం జూన్ నుండి చెల్లించాలని, నెలసరి వేతనం పది వేల కోసం డిమాండ్ చేశారు. వంటకు సంబంధించి సౌకర్యాలు, ప్రమాద బీమా, తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేష్, చిట్యాల లక్ష్మీ, హంస, మానస, ఉమ, ప్రమీల, కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వీడని మబ్బులు..

జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కొనసాగుతున్న మిశ్రమ వాతావరణం

నిర్మల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం సైతం ఆకాశం మేఘావృతమై కనిపించింది. రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా మిశ్రమ వాతావరణం కొనసాగుతోంది. ఆకాశంలో మబ్బులు కమ్ముకొని ఉండటంతో చలి తీవ్రత పూర్తిగా తగ్గిపోయింది. వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ ఇళ్లలో ఫ్యాన్ లేకుండా ఉండలేని విధంగా ఉక్కపోత కనిపించింది. జిల్లాలో కుబీర్ మండలంలో అత్యల్పంగా 20.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అవార్డులకు దరఖాస్తు చేయండి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవ అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన ప్రతిభ గల వ్యక్తులు, సామాజిక సేవ చేసిన సంస్థలు ప్రభుత్వం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఇచ్చే ప్రతిభ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారి మోహన్ సింగ్ ఒక ప్రకటనలో కోరారు. నేడు సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి జిల్లా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. సామాజిక సేవల, విద్యా, సాహిత్య, కళా, క్రీడారంగంలో ప్రతిభ చాటిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. వివరాలకు 040- 23391067 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు చలో బస్ భవన్ : టీఎంయూ

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం చేపట్టిన బస్ భవన్ విజయవంతం చేయాలని టీఎంయూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ఆర్. గంగాధర్ ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, పెండింగ్ బకాయిల విడుదల, కార్మికులపై పని భారం తగ్గింపు తదితర సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని ఆయన ఆరోపించారు. పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరు కావాలని కోరారు.

జాతీయ సాధన సర్వే పరీక్ష పరిశీలన

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ సాధన సర్వే పరీక్షను బుధవారం రాష్ట్ర నోడల్ అధికారి హరికృష్ణ పరిశీలించారు. డీఈవో రామారావు ఆయన వెంట ఉన్నారు. జుమ్మెరాత్‌పేట్, శాంతినికేతన్ పాఠశాలలను సందర్శించారు. ఎంఈవో నాగేశ్వర్ రావు, రిసోర్స్ పర్సన్ నారాయణ వర్మ, అబ్జర్వర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్ పాస్‌లు అందజేత

లక్ష్మణచాంద, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్టపెల్లి(కె)లో బుధవారం దివ్యాంగులకు బస్ పాస్‌లు అందజేశారు. పొట్టపెల్లి గ్రామంలో అర్హులైన 15 మంది దివ్యాంగులకు ప్రయాణంలో 50 శాతం రాయితీతో కూడిన బస్ పాసులను అందజేసినట్లు బస్‌పాస్ ఇన్‌చార్జ్ టీవీ రమణ తెలిపారు.

ఎల్లమ్మగుడిలో హుండీని దొంగలించిన దుండగులు

భైంసా రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో బుధవారం ఎల్లమ్మగుడిలో గుర్తు తెలియని దుండగులు హుండీని దొంగిలించారు. ఇద్దరు దుండగులు చొరబడి దొంగిలించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఐఈవో..



ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐఈవో

ఖానాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్మల్ డీఐఈవో జాదవ్ పరశురాం బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అబ్దుల్ హమీద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోష్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీదేవి, సరిత, మోహన్, రవీందర్, నాగరాజు, నరహరి, శ్రీనివాస్, సత్యనారాయణ, రమేష్, తదితరులున్నారు.

రూ. 42 కోట్లు ఏమైనట్లు ?

● మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బీజేపీ నాయకులు రాజేష్‌బాబు

బాసర, డిసెంబరు, 4: (ఆంధ్ర జ్యోతి) : బాసర ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం హయాంలో వచ్చిన రూ. 42 కోట్లు ఎటు పోయాయని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బీజేపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు రాజేష్‌బాబు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా బీజేపీ పార్టీ పిలుపు మేరకు బుధవారం బాసర మండలంలో కాంగ్రెస్ పార్టీ పనితీరుపై ఛార్జ్ షీట్‌ను విడుదల చేశారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్న నాయకులు గత బీఆర్ఎస్ హయాంలో ఉండి అనేక హామీలిచ్చి బాసర మండల ప్రజలను మోసగించారని ఆరోపించారు. బాసర అభివృద్ధికి రూ 100 కోట్లు తెప్పిస్తామని బాసర - ఓని రోడ్డు నిర్మాణం మరిచిపోయారని గుర్తు చేశారు. బాసర వద్ద గోదావరి నదిపై చెక్‌డ్యాం నిర్మిస్తామని వేసిన శిలాఫలకం విషయాన్ని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రోజుకొక గారడితో పరిపాలన సాగిస్తుందని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు డిసెంబరు 1వ తేది నుంచి 5వ తేదీ వరకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాల గురించి ప్రజలకు తెలిసే విధంగా ప్రతీ మండలంలో ఛార్జ్ షీట్‌ను విడుదల చేస్తున్నట్లు తెలిపారు బాసర అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం వచ్చిన రూ. 42 కోట్ల నిధులు ఈ ప్రభుత్వం వెనక్కి తీసుకుందని చేతనైతే నియోజకవర్గ ఆ పార్టీ నాయకులు ఆ నిధులను వెనక్కి తెప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ విడుదల చేసిన ఛార్జ్ షీట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సతీశ్వర్ రావు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సాయినాథ్, నాయకులు ప్రతాప్‌రావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై

అర్ధరహిత ఆరోపణలు చేస్తే సహించేది లేదు

● భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్

భైంసా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిపై బీజేపీ ప్రతినిధులు అర్ధరహిత ఆరోపణలకు దిగితే సహించేది లేదని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ తెలిపారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో వైస్ చైర్మెన్ ఫారుఖ్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు బాశెట్టి రాజన్న, సంజీవ్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి నియోజక వర్గ వ్యాప్తంగా రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఓర్వలేని తనంతో బీజేపీ ప్రతినిధులు సత్య దూరమైన ఆరోపణలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గత కొంత కాలంగా మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బాధిత కుటుంబాలకు జోరుగా సీఎం రిలీఫ్ ఫండ్‌లను అందిస్తూ, ముమ్మరంగా ప్రగతి పనులను మంజూరు చేయిస్తుండటంతో ఏమి చేయాలో పాలుపోలేని స్థితితో బీజేపీ ప్రతినిధులు అసందర్భ ప్రేలాపనలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ సర్కార్ దశాబ్ద కాలంలో జరుగని సంక్షేమాన్ని, ప్రగతిని ఏడాది కాలంలో చేపట్టిందని వివరించారు. దీనికి కూడా సహించని బీజేపీ ప్రతినిధులు ఇష్ట రాజ్యంగా ఆరోపణలు, విమర్శలకు దిగుతున్నారని దుయ్యబట్టారు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై వ్యక్తిగత ఆరోపణలు,దూషణలు,విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

నేడు కాంగ్రెస్ హామీల వైఫల్యాలపై బైక్ ర్యాలీ

లోకేశ్వరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ గార్యంటీల గారడీని 6 అబద్ధాలు 66 మోసాలను ఎండగడుతూ ముథోల్ నియోజకవర్గంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నామని పార్టీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ముథోల్ నియోజకవర్గ స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ నేతృత్వంలో ముథోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బైక్ ర్యాలీ, కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రజల ఆకాంక్షను నెరవేర్చే ందుకు ప్రభుత్వం కృషి

●మున్సిపల్ చైర్మన్ రాజూర సత్యం

ఖానాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చే దిశగా కృషి చేస్తోందని ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజూర సత్యం అన్నారు. బుధవారం ఖానాపూర్ మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి తెలంగాణ తల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, కౌన్సిలర్ కురుమ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జన్నారపు శంకర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్, మున్సిపల్ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది, తదితరులున్నారు.